# చైతన్య గళం

తెలుగు దిన పత్రిక

Pallavi Bhonagiri
Insurance Advisor
95330 82971
70137 85232
pallavibhongiri@gmail.com
Karmanghat, Hyderabad
Multi-Line Agent
Motor - Life - Health
We Find Your Best Rate

సంచిక :152 సంపుటి : 1 హైదరాబాద్ , రంగారెడ్డి , నాగర్ కర్నూల్ , మహబూబ్‌నగరం శనివారం 6 -7 -2024 వెల : రూ. 5.00

# నేడు తెలంగాణ,ఏపీ సీఎంల భేటీ




- ఇరు రాష్ట్రాల సీఎంలు తొలిసారి భేటీ
- ప్రగతి భవన్ లో అధికారుల ఏర్పాట్లు పూర్తి
- విభజన సమస్యలపై చర్చించే అవకాశం
- షెడ్యూలు 9, షెడ్యూలు 10 సంస్థల విభజనపై చర్చ!
- విద్యుత్తు సంస్థలకు బకాయిలపైనా చర్చలు



జులై 5 (చైతన్య గళం):–హైదరాబాద్,

రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశానికి సమయం దగ్గర పడుతోంది.. ఇప్పటికే ఢిల్లీ పర్యటన ముగించుకుని హైదరాబాద్ చేరుకున్నారు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి.. మరోవైపు.. హస్తిన పర్యటన ముగించి.. హైదరాబాద్‌లో అడుగుపెట్టనున్నారు ఏపీ సీఎం చంద్రబాబు.. ఇక, నేడు ప్రజా భవన్ వేదికగా రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు సమావేశం కాబోతున్నారు.. ఈ నెల ఆరో -మిగతా 2 లో



## తెలంగాణ సిఇవోగా సుదర్శన్ రెడ్డి

హైదరాబాద్,

తెలంగాణ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈవో)గా సుదర్శన్‌రెడ్డిని కేంద్ర ఎన్నికల సంఘం నియమించింది. ఈ మేరకు శుక్రవారం ఈసీ ఉత్తర్వులు వెలువరించింది. ప్రస్తుత సీఈవో వికాస్‌రాజ్‌ను ఈసీ రిలీవ్ చేసింది. నూతన సీఈవోగా నియమితులైన సుదర్శన్‌రెడ్డి ప్రస్తుతం జీఏడీ ముఖ్యకార్యదర్శిగా ఉన్నారు. ప్రస్తుతం జీఏడీ సర్వీసెస్‌లో సుదర్శన్ రెడ్డి విధులు నిర్వర్తిస్తున్న విషయం తెలిసిందే.



## జగన్ పాలనలో సరిదిద్దలేనంత నష్టం

- ఎపి పునర్నిర్మానమే తన ముందున్న లక్ష్యం
- మీడియాతో సిఎం చంద్రబాబు నాయుడు

జులై 5 (చైతన్య గళం):--న్యూఢిల్లీ,

ఐదేళ్ల పాటు రాష్ట్ర పునర్నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తామని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. రెండ్రోజుల ఢిల్లీ పర్యటన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఐదేళ్ల జగన్ పాలనతో సరిదిద్దలేనంత నష్టం జరిగిందన్నారు. 'దక్షిణాదిలో ఏ రాష్ట్రానికీ లేని గొప్ప వనరులు ఏపీకి ఉన్నాయి. నదుల అనుసంధానంతో అద్భుతాలు సాధించవచ్చు. గోదావరి నుంచే మొత్తం దక్షిణాది రాష్ట్రాలకు నీరు ఇవ్వొచ్చు. కేంద్రం నుంచి ఎలాంటి పదవులూ ఆశించలేదు.

-మిగతా 2 లో




## 37.5 కోట్ల భారతీయ కస్టమర్ల డాటా హ్యాక్

దేటా ఉల్లంఘన ఆరోపణలపై దర్యాప్తు చేస్తామన్న ఎయిర్‌టెల్

న్యూఢిల్లీ,
భారతదేశంలోని టాప్ టెలికాం కంపెనీల్లో ఒకటిగా పరిగణించబడుతున్న ఎయిర్‌టెల్ ప్రస్తుతం వార్తల్లో నిలిచింది. ఇటీవల రీఛార్జ్ ప్లాన్ లను పెంచిన సంగతి తెలిసిందే. కానీ ప్రస్తుతం కంపెనీకి చెందిన 37 కోట్ల మందికి పైగా వినియోగదారుల డేటాను తాను దొంగిలించానని ఓ హ్యాకర్ పేర్కొన్నాడు.

-మిగతా 2 లో



## నగరంలో ఇక బోనాల సందడి

- ఆదివారం గోల్కొండ బోనాలతో షురూ

హైదరాబాద్, ఆషాడ మాసం వచ్చిందంటే చాలు భాగ్యనగరంలో బోనాల సందడి మొదలవుతుంది. అమ్మ బైలెల్లినాదే అంటూ అమ్మవారికి భక్తులు చీర, సారెలు, నైవేద్యాలతో బోనాలు సమర్పిస్తుంటారు. ప్రతీ ఏడాది లాగే ఈ సారి -మిగతా 2 లో

# ఫార్మా రంగానికి కేంద్రంగా హైదరాబాద్



- పెద్దఎత్తున విదేశాలకు ఫార్మా ఎగుమతులు
- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

జులై 5 (చైతన్య గళం):--హైదరాబాద్,

నగరం నుంచి పెద్దఎత్తున విదేశాలకు ఫార్మా ఎగుమతులు జరుగుతున్నాయని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో నిర్వహించిన ఇండియన్ ఫార్మాస్యుటికల్ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఫార్మా క్లస్టర్లను ఓఆర్ఆర్ వెలుపల ఏర్పాటు చేస్తామన్నారు. విద్యుత్ రంగంలో కొత్త విధానాలు తీసుకువస్తామని తెలిపారు. ఫార్మా రంగానికి హైదరాబాద్ కేంద్రంగా మారిందని -మిగతా 2 లో

# రేవంత్ సర్కార్ వ్యూహాత్మక నిర్ణయం

- బీఆర్ఎస్ ను బలహీనపరుస్తున్న కాంగ్రెస్
- డైలమాలో పడ్డ బీఆర్ఎస్ పార్టీ క్యాడర్
- ఆరుగురు ఎమ్మెల్సీలు కాంగ్రెస్‌లో చేరికతో విస్మయం



జులై 5 (చైతన్య గళం):--హైదరాబాద్,

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలనాటికి ఎమ్మెల్యేల బలం పెంచుకునేందుకు రేవంత్ సర్కార్ వ్యూహాత్మకంగా పథకాలు రచిస్తోంది. అందులో భాగంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకుంటూ బీఆర్ఎస్ ను మానసికంగా బలహీనంగా మార్చేస్తోంది. కనీసం ఆ పార్టీ నుంచి ఎవరెవరు కాంగ్రెస్ లో చేరుతున్నారో కూడా తెలియనీయకుండా..లీకులకు బ్రేకులు వేసి మరీ చేర్చుకుంటోంది. సొంత పార్టీ నేతలే ఒకరిని ఒకరు అనుమానాస్పదంగా చూసుకునే పరిస్థితి ఏర్పడింది బీఆర్ఎస్ కు. అసలేం జరుగుతోందో తెలియని డైలమాలో ఉంది ఆ పార్టీ క్యాడర్ మొత్తం. -మిగతా 2 లో




## మలేషియా ఎయిర్‌పోర్టులో గ్యాస్ లీక్

-40 మంది ప్రయాణికులకు తీవ్ర అస్వస్థత

కౌలాలంపూర్,
ప్రపంచంలో నిత్యం బిజీగా ఉండే ఎయిర్‌పోర్టుల్లో మలేషియాలోని కౌలాలంపూర్ ఒకటి. అయితే ఆ విమానాశ్రయంలో గ్యాస్ లీక్ కావడం తీవ్ర కలకలం రేపింది. -మిగతా 2 లో



## బర్రెలక్క అరెస్ట్

- నిరుద్యోగుల ఆందోళనలో పాల్గొన్న బర్రెలక్క
- అరెస్ట్ చేసి ఠాణాకు తరలించిన పోలీసులు

జులై 5 (చైతన్య గళం):--హైదరాబాద్,

హైదరాబాద్ నాంపల్లిలోని టీజీపీఎస్ సీ కార్యాలయం దగ్గర నిరుద్యోగుల ఆందోళనలో బర్రెలక్క కూడా పాల్గొని నిరసన తెలిపింది. నిరుద్యోగుల ఆందోళనలో వారితో పాటు గొంతు కలిపింది.

-మిగతా 2 లో

## నగరంలో ఇక బోనాల సందడి

(మొదటి తరువాయి)

కూడా హైదరాబాద్‌లో బోనాల జాతరకు సర్వం సిద్ధమైంది. గోల్కొండ జగదాంబిక అమ్మవారికి తొలి బోనం సమర్పించడంతో బోనాల జాతర షురూ అవుతుంది. ఈనెల 7వ తేదీ ఆదివారం నుంచి గోల్కొండ ఖిల్లా నుంచి జాతర ప్రారంభంకానుంది. ఇప్పటికే బోనాల పండుగ కోసం పెద్ద ఎత్తున సర్కార్ ఏర్పాట్లు చేసింది. గోల్కొండ నుండే రాష్ట్రవ్యాప్తంగా బోనాల పండుగ మొదలవుతుంది. గోల్కొండ జగదాంబిక అమ్మవారి బోనాలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. రేపు ఒక్కరోజే సమయం ఉండడంతో ఇప్పటికే అన్ని ఏర్పాట్లు? పూర్తి అయ్యాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అన్ని శాఖల సమీక్షతో భారీ ఏర్పాట్లు జరిగాయి. గోల్కొండ తర్వాత సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి, లాల్ దర్వాజ మహాకాళి బోనాలను నిర్వహించడం జరుగుతుంది. ఆషాఢ మాసం చివరి రోజున తిరిగి గోల్కొండ కోటలో చివరి బోనంతో పూజలు చేసి ఉత్సవాలను ముగింపు పలుకుతారు.

## జగన్ పాలనలో సరిదిద్దలేనంత నష్టం

(మొదటి తరువాయి)

వాజ్‌పేయీ ప్రభుత్వంలోనూ పదవులు ఆశించలేదు. ఏడు మంత్రి పదవులు తీసుకోవాలని వాజ్‌పేయీ కోరినా అంగీకరించలేదు. ఎన్డీయే ఉన్నందున అప్పుడు స్పీకర్ పదవి తీసుకున్నాం. ఇప్పుడు కూడా ఎన్డీయే ఇచ్చిన రెండు మంత్రి పదవులతో సంతోషంగానే ఉన్నాం. జగన్ పాలనతో అమరావతిపై జనాకర్షణ కొంత తగ్గింది. రాజధానికి పూర్వ వైభవం తేవడమే మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. అక్కడ 135 ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటుకానున్నాయి. రాజధానికి అవసరమైన మౌలిక వసతులన్నీ కల్పిస్తున్నాం. అమరావతిలో ఐకానిక్ బిల్డింగ్ సహా అన్నీ పూర్తి చేస్తాం. తొలుత నిర్మాణంలో ఉన్నవాటికి ప్రాధాన్యత ఇస్తాం. రాష్ట్రంలో కులగణన స్థానంలో నైపుణ్య గణన చేస్తాం. నైపుణ్య గణనకు త్వరలో మార్గదర్శకాలు విడుదల చేస్తాం. మానవ వనరులే పెట్టుబడిగా సంపద సృష్టిస్తాం. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలతో ఉపాధి కల్పిస్తాం. పీపీపీ నమూనా స్థానంలో పీ–4 విధానం తెస్తాం. దావోస్ పెట్టుబడుల సదస్సుకు తప్పకుండా హాజరవుతా. మళ్లీ జగన్ వస్తే ఎలా అని అన్ని వర్గాలూ అడుగుతున్నాయి. డెవిల్‌ను నియంత్రించాం.. ఇకపై ఎవరీ ఇబ్బంది ఉండదు‘ అని చంద్రబాబు తెలిపారు.

## 37.5 కోట్ల భారతీయ కస్టమర్ల డాటా హ్యాక్

(మొదటి తరువాయి)

కస్టమర్ల వ్యక్తిగత వివరాలను ప్రముఖ హ్యాకింగ్ ఫోరమ్‌లో విక్రయానికి ఉంచుతున్నట్లు ఓ హ్యాకర్ తాజాగా ప్రకటించాడు. దీంతో ఒక్కసారిగా వినియోగదారులు కంగారు పడ్డారు. ఇది భారతదేశంలో ఆందోళన కలిగించే అంశంగా మారింది. తాజాగా ఈ ప్రకటనపై ఎయిర్‌టెల్ స్పందించింది.ఎయిర్‌టెల్ ఇండియా డేటా ఉల్లంఘన ఆరోపణలపై స్పందిస్తూ.. తాము క్షుణ్ణంగా దర్యాప్తు చేశామని, ఎయిర్‌టెల్ సిస్టమ్‌ల నుంచి ఎటువంటి ఉల్లంఘన జరగలేదని నిర్ధారిస్తున్నట్లు కంపెనీ ప్రకటించింది. డార్క్ వెబ్ ఇన్‌ఫార్మర్ ద్వారా వెలువడిన తప్పుడు డేటా ఉల్లంఘనగా దీన్ని అభివర్ణించింది. దీంతో ఎయిర్ టెల్ యూజర్లు ఊపిరిపీల్చుకుంటున్నారు. అయితే అంతకు ముందు డార్క్ వెబ్‌లో ఓ పోస్ట్ ప్రకారం, ‘ అనే మారుపేరుతో హ్యాకర్ 37.5 కోట్ల మంది ఎయిర్‌టెల్ ఇండియా కస్టమర్ల మొబైల్ నంబర్, పుట్టిన తేదీ, తండ్రి పేరు, ఆధార్ ఐడీ, ఇమెయిల్ ఐడీ, ఇతర వివరాలతో కూడిన డేటాబేస్‌ను విక్రయానికి ప్రయత్నించాడు. క్రిప్టోకరెన్సీలో చెల్లించాల్సిన దీనికి 41 లక్షల రేటు పెట్టాడు. దీంతో కస్టమర్లు కంగారు పడ్డారు. స్పందించిన టెలికాం కంపెనీ తప్పుడు సమాచారాన్ని అందిస్తున్నాడని..ప్రకటించింది.

## బర్రెలక్క అరెస్ట్



(మొదటి తరువాయి)

గ్రూప్ 2,3 పోస్టులను పెంచాలని, డిసెంబరులో పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేస్తూ టీజీపీఎస్సీ కార్యాలయం ముట్టడికి నిరుద్యోగులు పిలుపునిచ్చారు. డీఎస్సీని అక్టోబర్‌కు వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. టీజీపీఎస్ సీ దగ్గర నిరుద్యోగులకు మద్దతుగా ఆందోళనకు దిగిన బర్రెలక్క(శిరీష)ను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం ఆమెను పీఎస్ కు తరలించారు. పోలీసులు వాహనంలో తీసుకెళ్తుంటే.. సీఎం రేవంత్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. నిరుద్యోగుల తరపున పోరాడుతుంటే తనను అరెస్ట్ చేయడమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యం చేయకూడదన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో పశువుల కాపరి అయిన(బీకామ్ గ్రాడ్యుయేట్) బర్రెలక్క ఫేమస్ అయ్యారు. అసెంబ్లీ ఎన్నికలతో పాటు, ఇటీవల జరిగిన లోక్ సభ ఎన్నికల్లో పోటీచేసి ఓటమి పాలయ్యారు.

# నేడు తెలంగాణ, ఏపీ సీఎంల భేటీ

(మొదటి తరువాయి)

తేదీన భేటీ అవుదామనే ప్రతిపాదనను తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ముందుంచారు ఏపీ సీఎం.. దానికి అంగీకరించారు తెలంగాణ ముఖ్యమంత్రి.. అయితే, ఈ భేటీలో ఏ అంశాలపై చర్చ సాగనుంది అనేది ఆసక్తికరంగా మారింది.. ముఖ్యంగా తెలంగాణ నుంచి ఏపీకి రావాల్సిన బకాయిలు ఏమున్నాయనే కోణంలో ఏపీ ప్రభుత్వం సమాచారాన్ని సేకరిస్తున్నట్టు తెలుస్తోంది.. షెడ్యూల్ 9,10 పరిధిలోని సంస్థల విభజన.. ఆస్తుల పంపకాల వంటివి ఇంకా తేలాల్సి ఉంది. ఆర్టీసీ ఆస్తుల విభజన జరగకపోవడం కీలకమైన వ్యవహారంగా ఉంది. అలాగే ట్రాన్స్‌కో, ఉన్నత విద్యా మండలి, పట్టాణభివృద్ధి శాఖ పరిధిలోని ఏపీ హౌసింగ్ బోర్డు నుంచి కొన్ని వేల కోట్ల రూపాయల మేర పెండింగ్ బకాయిలు తెలంగాణ ప్రభుత్వం నుంచి ఏపీకి రావాల్సి ఉంది. ఈ అంశాలపై ప్రధానంగా ఫోకస్ పెట్టనున్నట్టు సమాచారం.. ప్రస్తుతం ఏపీ ప్రభుత్వం పీకల్లోతు ఆర్థిక కష్టాల్లో ఉన్న క్రమంలో తెలంగాణ నుంచి రావాల్సిన నిధుల్లో కొంత మొత్తం వచ్చినా.. ఏపీకి కాస్తో కూస్తో ఆర్థిక ఊరట ఉంటుందనేది ప్రభుత్వ పెద్దల భావనగా ఉందట%ొ% దీంతో పాటు.. రెండు రాష్ట్రాల మధ్య నెలకొన్న నీటి వివాదాలు.. నదీ జలాల వాటాల గొడవలు.. డిస్కంలు, ఇరిగేషన్ ప్రాజెక్టుల గొడవ వంటివి కూడా సీఎంల భేటీలో ప్రస్తావనకు తెచ్చేలా ఏపీ ప్రభుత్వం సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. మరోవైపు, ఇప్పటికీ కొంత మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు అక్కడి వారు ఇక్కడ.. ఇక్కడి వారు అక్కడ అనే రీతిలో పని చేస్తున్నారు. ఏపీకి అలాట్ చేసిన వారు కూడా తెలంగాణలో పని చేస్తున్న పరిస్థితి. అలాంటి వారి విషయంలో ఏం చేయాలనే దానిపై క్లారిటీకి రావాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. ఇక ఏపీ నుంచి తమను రిలీవ్ చేయాలని తెలంగాణ ఉద్యోగుల కోరుతున్నారు. ప్రస్తుతం ఏపీలో 712 మంది స్థానికత ఉన్న ఉద్యోగులు పని చేస్తున్నారు. సచివాలయం, హెచ్వోడీలు, 9, 10వ షెడ్యూల్ సంస్థల్లో పని చేస్తున్న 224 మంది రాష్ట్ర కేడర్ ఉద్యోగులను కూడా రిలీవ్ చేయాలని కోరుతోన్నారు ఏపీలోని తెలంగాణ ఉద్యోగులు. సీనియార్టీ కొల్పోయినా ఫర్వాలేదని.. తమను తమ రాష్ట్రానికి పంపాలని తెలంగాణ ఉద్యోగులు అంటున్నారు. విభజన జరిగి పదేళ్లైనా స్థానికత ఆధారంగా తమను స్వరాష్ట్రానికి పంపకపోవడంపై తెలంగాణ ఉద్యోగుల ఆవేదన చెందుతున్నారు. తమ విజ్ఞప్తులను పరిష్కరించాలని రెండు రాష్ట్రాల సీఎంలను అభ్యర్థిస్తున్నారు ఏపీలోని తెలంగాణ ఉద్యోగులు. ఈ విషయం మీద సీఎంల భేటీలో ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉందంటున్నారు. ఇక అన్నింటికంటే ముఖ్యం.. రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రతి అంశంలోనూ గొడవలు పడుతూ ఉంటే.. కేంద్రం జోక్యం అనివార్యమవుతుంది. దీంతో పరిస్థితి మరింత జఠిలం కావడం తప్ప.. సమస్య సులువుగా పరిష్కారం కాదనేది ప్రభుత్వ పెద్దల ఆలోచన. దీంతో ముందుగా ఈజీగా సాల్వ్ అయ్యే పరిష్కారాలేంటో చూసుకుని.. వీలైనంత త్వరగా మెజార్టీ సమస్యలను పరిష్కరించుకోవాలని ఏపీ ప్రభుత్వం భావిస్తుందట.. అయితే, ఈ భేటీలో రెండు రాష్ట్రాల సీఎంలతో పాటు.. ఇంకా ఎవరెవరు పాల్గొంటారు.. అజెండా ఏంటి అనేదానిపై మాత్రం మరింత క్లారిటీ రావాల్సి ఉంది.

# ఫార్మా రంగానికి కేంద్రంగా హైదరాబాద్

(మొదటి తరువాయి)

ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు.– హైటెక్స్ లో ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాన్ఫరెన్స్ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీదర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఫార్మా రంగ ప్రతినిధులు పాల్గొన్నారు. దేశ విదేశాలకు హైదరాబాద్ నుంచి ఎగుమతులు జరుగుతున్నాయని ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. పారిశ్రామిక వేత్తలకు మా ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, పెట్టుబడిదారులకు అన్ని రకాల సౌకర్యం కల్పిస్తామని ఆయన అన్నారు. టెక్నాలజీ అభివృద్ధిలో ఏఐ ఎంతో కీలక పాత్ర పోషిస్తోంది. 73వ ఫార్మా కాంగ్రెస్ లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పలు అంశాలు మాట్లాడారు. దేశంలో 35 శాతం ఫార్మా ఉత్పత్తులు తెలంగాణ నుంచే ఉన్నాయని అది రాష్ట్రానికి గర్వకారణమని భట్టి అన్నారు. ప్రతి ఏటా 50వేల కోట్ల విలువైన మెడిసిన్ ఎగుమతి చేస్తున్నాం అన్నారు. కోవిడ్ వంటి మహమ్మారి సమయంలో అసమానమైన చురుకుదనం ప్రదర్శించి, అవిశ్రాంతంగా శ్రమించారని ఫార్మసిస్టుల సేవలను ఆయన కొనియాడారు. ఫార్మా పరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి మద్దతుగా నిలుస్తుంది అన్నారు. హైదరాబాద్ బిర్యానీకి ప్రసిద్ధి, ఇప్పుడు బిర్యానీతోపాటు బయో ఫార్మా ఉత్పత్తులకు ప్రసిద్ధిగాంచిందని తెలిపారు. అందరికీ ఆరోగ్యం అందుబాటులో తీసుకొస్తే దృఢమైన ప్రపంచాన్ని నిర్మించగలమన్నారు. బౌల్ అఫ్ ఫార్మ గా హైదరాబాద్ స్థిరపడిందన్నారు. సుగంధ ద్రవ్యాలను సరఫరా చేసే స్థాయి నుంచి మానవ జీవితాలను కాపాడే మందుల సరఫరా దశకు తెలంగాణ రాష్ట్రం చేరుకుందన్నారు. ఫార్మా రంగంలో అనేక ఆవిష్కరణలకు హైదరాబాద్ కేంద్రంగా మారింది అన్నారు. ఫార్మా రంగానికి హైదరాబాద్ కేంద్రంగా మారిందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. దేశ, విదేశాలకు ఇక్కడి నుంచి ఎగుమతులు జరుగుతున్నాయని తెలిపారు. పారిశ్రామికవేత్తలకు తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. పెట్టుబడిదారులకు అన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం కృత్రిమ మేధ (ఏఐ) ఎంతో కీలక పాత్ర పోషిస్తోందని వివరించారు. ఏఐను అందిపుచ్చుకోవడానికి తగిన విధంగా ప్రణాళిక సిద్ధం చేసినట్లు శ్రీధర్‌బాబు తెలిపారు.వైఎస్‌ఆర్ హయాంలో ఓఆర్‌ఆర్ నిర్మించామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. దాంతో హైదరాబాద్‌కు ఎన్నో ఐటీ పరిశ్రమలు వచ్చాయన్నారు. రీజినల్ రింగు రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) నిర్మాణం కూడా చేపట్టాలని కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు. పారిశ్రామిక వేత్తలకు తగిన ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పారిశ్రామికవేత్తలు సామాజిక బాధ్యతలో భాగంగా తోడ్పాటు అందించాలని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు.

# రేవంత్ సర్కార్ వ్యూహాత్మక నిర్ణయం

(మొదటి తరువాయి)

ఇలాంటి పరిస్థితిలో బీఆర్?ఎస్?కు మరో భారీ దెబ్బ తగిలింది. గురువారం అర్ధరాత్రి ఆ పార్టీకి చెందిన ఆరుగురు ఎమ్మెల్సీలు ఒకేసారి కాంగ్రెస్‌లో చేరడం సంచలనం రేపింది. ఎక్కడా కూడా హడావుడి లేకుండా, ఎలాంటి ముందస్తు ఊహాగానాలకు తావివ్వకుండా ఎమ్మెల్సీల చేరిక జరిగింది. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో వారంతా కాంగ్రెస్ కండువాలు కప్పుకొన్నారు. ఆ సమయంలో సీఎం రేవంత్?తో పాటు రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి దీపాదాసు మున్షీ, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్ రెడ్డిలు ఉన్నారు. ఇకపై కంటిన్యూగా జాయినింగ్స్ ఉంటాయని టీపీసీసీకి చెందిన నేతలు చెబుతున్నారు.. తమ టార్గెట్ 25 మంది ఎమ్మెల్యేలని, ఇప్పటికే ఆరుగురు చేరగా, త్వరలో మిగతా వారంతా చేరుతారని చెప్పారు. బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరిన ఎమ్మెల్యేలతో కలుపుకుంటే ప్రస్తుతం అధికార పార్టీ సభ్యుల సంఖ్య 71కి చేరుకుంది. కాగా తెలంగాణ శాసన మండలిలో కూడా ఆధిక్యం కోసం కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతోంది. శాసన మండలిలో మొత్తం సభ్యుల సంఖ్య 40. ప్రస్తుతం 2 సీట్లు ఖాళీగా ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీకి ఇప్పుడు ఆరుగురు మాత్రమే సభ్యులు న్నారు. తాజాగా ఆరుగురు సభ్యులు చేరడంతో వారి బలం 12కు చేరింది. వామపక్ష ఎమ్మెల్సీ మద్దతుతో కలిపితే 13కు చేరుతుంది. కాంగ్రెస్ పార్టీకి మరో ఐదారు సీట్లు ఉంటే మండలిలో కూడా మెజారిటీ దక్కుతుంది. ప్రస్తుతం తెలంగాణ మండలిలో బీజేపీకి ఇద్దరు సభ్యులు ఉన్నారు. కీలక బిల్లులను నెగ్గించుకునే రేవంత్ ప్రభుత్వం ఇబ్బందులు లేకుండా ముందుకు సాగే వీలుంటుంది. బీఆర్?ఎస్? ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, భాను ప్రసాద్, దండె విఠల్, ఎం.ఎస్ ప్రభాకర్, యెగ్గె మల్లేశం, బుగ్గారపు దయానంద్ పార్టీ మారారు. గురువారం సాయంత్రం హైదరాబాద్‌లోని ఓ హోటల్ సమావేశమైన వారు రాత్రి 12 గంటల సమయంలో జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసానికి చేరుకున్నారు. ముఖ్యమంత్రి హస్తిన పర్యటన ముగించుకుని ఇంటికి చేరుకోగానే వారు పార్టీలో చేరారు. సీఎం ఢిల్లీ నుంచి వచ్చిన నిమిషాల్లోనే చేరికల కార్యక్రమం చకచకా పూర్తవడం గమనార్హం. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలంతా కాంగ్రెస్‌లో చేరబోతున్నారని గత కొన్ని రోజుల నుంచి పొలిటికల్ వర్గాల్లో విస్తృతంగా చర్చ జరుగుతున్నది. ఫలానా ఎమ్మెల్యే కాంగ్రెస్‌లోకి వెళ్తున్నారంటూ మీడియా సర్కిళ్లలోనూ డిస్కషన్స్ జరుగుతూనే ఉన్నాయి. కానీ పార్టీ తీసుకుంటున్న ముందస్తు జాగ్రత్తలతో ఎవరు, ఎప్పుడు పార్టీ చేంజ్ అవుతున్నారనే విష యం ఇటు పబ్లిక్‌తో పాటు పార్టీ నేతలకూ తెలియ దం లేదు. సీఎం రేవంత్ రెడ్డి వ్యూహాలు ప్రతిపక్ష పార్టీలకు చిక్కకుండా అమలవుతున్నాయని కాం గ్రెస్ పార్టీ నేతలు సంతోష పడుతున్నారు.

# మలేషియా ఎయిర్‌పోర్టులో గ్యాస్ లీక్

(మొదటి తరువాయి)

అంతేకాదు దాదాపు 40 మంది వరకు ప్రయాణికులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. అసలేం జరిగింది? ప్రతీ నిమిషం అలర్ట్‌గా ఈ ఎయిర్‌పోర్టులో గ్యాస్ ఎలా లీకైంది? అధికారుల లోపమా? లేక మరేదైనా జరిగిందా? ఇవే ప్రశ్నలు ఎయిర్‌పోర్టు అథారిటీని వెంటాడుతున్నాయి. ఎయిర్‌పోర్టులోని సదరన్ సపోర్ట్ జోన్ సెపాంగ్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజనీరింగ్ ఫెసిలిటీ ఉంది. ఉదయం పదకొండున్నర గంటల సమయంలో అక్కడ గ్యాస్ లీకైంది. ఈ ఘటన దాదాపు 39 మంది వరకు ప్రయాణికులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే వారిని చికిత్స కోసం మరో ప్రాంతానికి తరలించారు. వారంతా ఆసుపత్రిలో ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నారు. గ్యాస్ లీక్ గురించి సమాచారం అందుకున్న సెలంగోర్ అగ్రిమాపక సిబ్బంది వెంటనే దాన్ని కంట్రోల్ చేసిందని అధికారులు చెబుతున్నమాట. ఈ ఘటనలో ఎవరికీ ప్రమాదం జరగలేదన్నారు. అయితే విడుదలైన గ్యాస్.. మిథైల్ మెర్‌కాప్టాన్‌గా గుర్తించారు. ఈ ఘటన కారణంగా విమాన రాకపోకల విషయంలో ఎలాంటి మార్పులు ఉండవని చెప్పుకొచ్చారు. ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు మొదలుపెట్టారు.

# పర్యాటక రంగం అభివృద్ధితోపాటు నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా తెలంగాణలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తాం





**-మంత్రులు జూపల్లి కృష్ణారావు, దామోదర్ రాజనర్సింహ.**

నాగర్ కర్నూల్ జిల్లా జూలై 5 (చైతన్య గళం): పులులు, శైవ క్షేత్రాలు, జలపాతాలకు నిలయమైన నల్లమల అటవీ ప్రాంతాన్ని దేశ, విదేశాల పర్యాటకులను రప్పించే దిశగా నల్లమల్లలో ఎకో టూరిజం హబ్ గా తీర్చిదిద్దేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో టూరిజాన్ని అభివృద్ధి చేసి రాష్ట్ర ఆర్థిక వనరులను పెంపొందించనున్నట్లు మంత్రులు దామోదర రాజనర్సింహ జూపల్లి కృష్ణారావు తెలిపారు. శుక్రవారం నాగర్ కర్నూల్ జిల్లా నల్లమల్లలో పర్యాటకరంగం అభివృద్ధికై ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలతో కలిసి మంత్రులు జూపల్లి కృష్ణారావు, దామోదర్ రాజనర్సింహ నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని రంగాపూర్ గ్రామంలోని ఉమామహేశ్వర దేవస్థానాన్ని, నిరంజన్ షావలి దర్గాను సందర్శించి దర్శించుకున్నారు. అనంతరం అమ్రాబాద్ మండలంలోని మన్ననూర్ గ్రామ శివారు చింతల చెరువు వద్ద మంత్రులు, ఎమ్మెల్యేలు అధికారులు 75 వన మహోత్సవం సందర్భంగా విద్యార్థులతో కలసి 350 మొక్కలు నాటారు. తదనంతరం నల్లమల్ల అటవీ ప్రాంతంలోని బౌరాపూర్ పెంట వరకు జంగల్ సఫారీ వాహనంలో మంత్రులు ఎమ్మెల్యేల అధ్యయన బృందం పర్యటించి, నల్లమల అటవీ ప్రాంతంలో పలు పర్యాటక ప్రదేశాలను పరిశీలించారు. ఫరహాబాద్ వ్యూ పాయింట్ ను బృందం సభ్యులు సందర్శించారు. అక్కడే పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ....నల్లమల్ల అటవీ ప్రాంతంలో అందమైన ,అత్యంత రమణీయమైన పర్యాటక వనరులు ఉన్నాయని, దేశ విదేశాల పర్యాటకులను నల్లమల్ల ప్రాంతంలో సందర్శించే విధంగా తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసి నల్లమల్ల ప్రాంతం ప్రపంచ దేశాల పర్యాటకులకు తెలిసే విధంగా తీర్చిదిద్దనున్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని పర్యాటక రంగాన్ని అభివృద్ధి చెందేలా ప్రతి జిల్లాలో ప్రతి నెలలో సందర్శించి పర్యాటక రంగం కేంద్ర బిందువుగా తెలంగాణను తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ కర్తవ్యమని మంత్రి చెప్పారు. టూరిజం అభివృద్ధితోపాటు తెలంగాణ నిరుద్యోగ యువకులకు ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తుందని మంత్రి స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆదాయాన్ని పెంచుకునే దిశగా రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కొన్ని దేశాల్లో వనరులు లేకపోయినప్పటికీ పర్యాటక రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయని, తెలంగాణ రాష్ట్రంలో పర్యాటక రంగానికి అత్యధిక వనరులు ఉన్నాయని, వాటిని ఈ రాష్ట్ర ప్రభుత్వం సద్వినియోగం చేసుకొని పర్యాటక రంగాన్ని మరింతగా బలోపేతం చేసే దిశగా కృషి చేసేందుకే నేడు నల్లమల్లలు స్టడీ టూర్ ను నిర్వహిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో అత్యంత పురాతన సంపద, కళ లు ఉన్నాయని వాటిని ఆ దిశగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధితో పాటు నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న తపనతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని మంత్రి తెలిపారు. తెలంగాణలో అనేక పర్యాటక ప్రదేశాలు ఉన్నాయని, పురాతన కట్టడాలు,కొండలు,గుట్టలు,పురాతన గొప్ప దేవాలయాలు, పురాతన కళా సంపద ఉన్నాయని ,పర్యాటకులను రప్పించే ప్రదేశాలు చాలా ఉన్నాయని,పర్యాటక ప్రాంతాల ద్వారా స్థానిక యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, లభిస్తాయని తద్వారా రాష్ట్రానికి ఆదాయం కూడా సమకూరుతుందని తెలిపారు. టూరిజం మరియు ఫారెస్ట్ శాఖలు సంయుక్తంగా పీపీపీ పద్ధతి ద్వారా పర్యాటకంగా ఆదాయం పెంచే కార్యాచరణ రూపొందించ నున్నట్లు తెలిపారు. అడవులను సంరక్షిస్తూ,అడవులలోని అందాలను ప్రకృతి ప్రేమికులు ఆస్వాదించే విధంగా ఆయా ప్రదేశాలను అభివృద్ధిని చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఇన్చార్జి మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ....నల్లమల్లప్రాంతంలో అడవులను పచ్చదనాన్ని కాపాడుతూనే తెలంగాణ పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలన్నదే మా సంకల్పమని మంత్రి తెలిపారు. పచ్చదనంతో ప్రసిద్ధి గాంచిన నల్లమల్లను టూరిజం హబ్బుగా మార్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని మంత్రి తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని పర్యాటక రంగం అభివృద్ధి చెందాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు మంత్రుల ఎమ్మెల్యేల బృందం నల్లమల్ల అటవీ ప్రాంతంలో ప్రదేశాలను సందర్శించినట్లు, నల్లమల్ల అడవి ప్రాంతంలో గల బౌరాపూర్ టెంపుల్, పరహాబాద్ లో వ్యూ పాయింట్ ప్రకృతి ప్రేమికులకు చాలా ఆనందాన్నిస్తుందని, ఇలాంటి ప్రకృతి రమణీయమైన ప్రదేశాలు నల్లమల్ల ప్రాంతంలో అనేకంగా ఉన్నాయని కావున నల్లమల్ల అడవి ప్రాంతం టూరిజం హబ్ గా,టూరిజం డెస్టినేషన్ గా ఉండబోతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణ రెడ్డి, వాకిటి శ్రీహరి, డా. రాజేష్ రెడ్డి, వీర్లపల్లి శంకర్, మధుసూదన్ రెడ్డి, మేఘారెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్,పర్యాటక, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి వాణిప్రసాద్, పీసీసీఎఫ్ ఆర్.ఎం. డోబ్రియల్, పర్యాటక పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాష్ రెడ్డి, పురావస్తు శాఖ డైరెక్టర్ భారతి హొలికేరి, పర్యాటక శాఖ డైరెక్టర్ ఇల త్రిపాఠి, కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ రఘునాథ్ గైక్వాడ్, డీఎఫ్వో రోహిత్, ఇతర అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు...

# అభయాంజనేయ స్వామికి అమావాస్య పూజలు

**-అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన బచ్చురాం కుటుంబం**

వనపర్తి జులై 5 (చైతన్య గళం): వనపర్తి జిల్లా కేంద్రానికి అతి దగ్గరలో ఉన్న తిరుమలయ్య గుట్ట సన్నిధిలో వెలసిన అభయాంజనేయ స్వామికి బిజెపి వనపర్తి పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము కుటుంబ సమేతంగా అమావాస్య ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంను నిర్వహించారు. అభయాంజనేయ స్వామి అమావాస్య పూజలో జిల్లా నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజా కార్యక్రమాలు, భజనలు నిర్వహించారు. అనంతరం పూజ కు



హాజరైన మహిళలకు పసుపు, కుంకుమను బచ్చు రాము కుటుంబం సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుల సబ్బిరెడివెంకటరెడ్డి మాట్లాడుతూతిరుమలయ్య గుట్ట పై వెలసిన శ్రీ రంగనాయక స్వామి ని దర్శించుకునేందుకు శ్రావణమాసం లో భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు.. భక్తులకు కనీస సౌకర్యాలు, కల్పించేందుకు, 58 అడుగుల ఆంజనేయ విగ్రహాన్ని నెలకొల్పేందుకు ఐదు గుంటల భూమిని ఇవ్వాలని, తిరుమలయ్య గుట్టను పర్యాటక కేంద్రంగా మార్చాలని బచ్చు రాము ఆధ్వర్యంలో కలెక్టర్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మెగా రెడ్డి కి వినతి పత్రాలు అందజేశామని తెలిపారు. తిరుమలయ్య గుట్టను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ పెద్దలు తమ వంతు కృషి చేయాలని ఈ సందర్భంగా సబిరెడ్డి వెంకటరెడ్డి కోరారు.

# సెప్టెంబర్ 17విశ్వకర్మ జయంతి ని విజయవంతం చేయండి

**-శ్రీ శ్రీ విశ్వబ్రాహ్మణ సంగం అధ్యక్షుడు నారోజు కుమారస్వామి చారి**

బడంగ్ పేట్ జూలై 5 (చైతన్య గళం): రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆల్మాస్గూడ శ్రీ శ్రీ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అమావాస్య సందర్భంగా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నారోజూ కుమారస్వామి చారి మాట్లాడుతూ... సెప్టెంబర్ 17న జరిగే విశ్వకర్మ జయంతి మహోత్సవంలో జరిపే యజ్ఞ కార్యక్రమానికి సంబంధించి కమిటీ ఏర్పాటుపై చర్చించి మరియు ఈ కార్యక్రమానికి బ్రహ్మంగారి



మఠం పీఠాధిపతిని ఆహ్వానించే విషయం, సంఘం యొక్క నియమ నిబంధనలు, బలోపేతానికి సభ్యుల యొక్క పాత్ర మరియు ప్రతి అమావాస్య రోజున సంఘం ప్రధాన కార్యాలయంలో జరిగే సమావేశానికి ప్రతి సభ్యుడు హాజరై, విశ్వకర్మలకు ఎదురయ్యే సమస్యలపై చర్చించాలని అలాగే వాటి పరిష్కారానికి సంఘం ఎల్లపుడూ కృషి చేస్తుందని, తదితర విషయాలపై సభ్యులతో కలిసి నారోజు కుమారస్వామి చారి చర్చించి తీర్మానం చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆల్మాస్గూడ శ్రీ శ్రీ విశ్వబ్రాహ్మణ సంఘం కమిటీ కోశాధికారి బండోజు రవికుమార్ చారి, రాజేష్ చారి, బండి కట్ల వెంకటేశ్వర్ల చారి, పసునూరు మల్లేష్ చారి, గోవర్ధన్ చారి, మురళి చారి, కనకాచారి, కార్యవర్గ సభ్యులు, విశ్వబ్రాహ్మణ బంధుమిత్రులు తదితరులు పెద్దయెత్తున పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రభాకర్



ఉప్పల్ జులై 5 (చైతన్య గళం): ఉప్పల్ జన్ సంఘ్ వ్యవస్తాపకులు దివంగత డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి నుండి జయంతి వరకు వారం రోజుల పాటు జరుపుకునే కార్యక్రమం సందర్భంగా నాచారం ట్రక్ పార్క్ అసోసియేషన్ ప్రాంతంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు పోతగాని గోపాల్ గౌడ్, లక్ష్మా రెడ్డి, అశోక్ రెడ్డి, బాలకృష్ణ రెడ్డి, ట్రక్ ఓనర్స్, డ్రైవర్లు, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులతో విద్యార్థి ఉద్యమాన్ని ఆపలేరు

**-బద్రీనాథ్ గుప్త**




మంచాల జులై 5 (చైతన్య గళం): మంచాల నిరుద్యోగ జేఏసీ బీజేవైఎం, బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో నిరుద్యోగ జేఏసీ హైదరాబాద్లోని టీజీపీఎస్సీ కార్యాలయ ముట్టడికి పిలుపు ఇచ్చింది. ఈసందర్భంగా మంచాల మండలం BRS యువజనా విభాగం అధ్యక్షులు వనపర్తి భద్రినాద్ గుప్తా BRSV మంచాల అధ్యక్షులు బోట్టు ప్రవీణ్ నీ మంచాల పోలీసులు ముందస్తు అరెస్టు చేయడం జరిగింది. గ్రూప్ 2, 3 పోస్టుల సంఖ్య పెంపు, గ్రూప్1 మెయిన్స్కు 1:100 నిష్పత్తి పాటించాలి, జాబ్ క్యాలెండర్, జీవో 46 రద్దు వంటి డిమాండ్లతో నిరుద్యోగులు పోరుబాటపట్టారు. ఈసందర్భంగా బద్రీనాథ్ గుప్త మాట్లాడుతూ ఎన్ని అరెస్టులు చేసిన ఉద్యమని ఆపలేరు అని అన్నారు.

## అమావాస్య అన్న ప్రసాద వితరణ



ఎల్బీనగర్ జులై 5 (చైతన్య గళం): ఎల్బీనగర్ ఆర్యవైశ్య సంఘం కొత్తపేట వారి ఆధ్వర్యంలో అమావాస్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో భాగంగా ప్రసన్న మహంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరంనైవేద్యం అన్న ప్రసాదం పంపిణీ చేశారు .ఈకార్యక్రమంలో కొత్తపేట ఆర్యవైశ్య సంఘం సబ్యులకు పాల్గొన్నారు

## బొలెరో వాహనం-బైక్ ఢీ వ్యక్తి మృతి




వనపర్తి జులై 5 (చైతన్య గళం): వనపర్తి జిల్లా కొత్తకోట మండలం పామాపురం గ్రామానికి చెందిన సంద మహేష్ (35 ) వృత్తి: డ్రైవర్ తన పల్సర్ మోటార్ సైకిల్ పై కొత్తకోట నుండి వనపర్తికి తన పిల్లల పుస్తకాలు కొనడానికి అదే గ్రామానికి చెందిన తన మిత్రుడు సాయిబాబు తో కలిసి వనపర్తి వస్తుండగా మార్గమధ్యం ల నాగవరం వద్ద భారత్ పెట్రోల్ బంకు ఎదురుగా కొత్తకోట వైపు వెళ్తున్న ఇండియా -1 ఏటీఎం బొలెరో వాహనం ఢీకొట్టడంతో సంద మహేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. అదే పల్సర్ వాహనంపై ప్రయాణిస్తున్న సాయిబాబు తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం సాయిబాబాను జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య మాధవి ఫిర్యాదు మేరకు వనపర్తి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున దర్యాప్తు చేస్తున్నారు.

## జిల్లా ఇంటర్మీడియట్ అధికారిని సన్మానించిన తిరుమలేష్




వనపర్తి జులై 5 (చైతన్య గళం): నూతన వనపర్తి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిని గా కె.రాధా పి.విజయలక్ష్మి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు ఇక్కడ విధులు నిర్వహించిన మద్దిలేటి గత నెలలో పదవ విరమణ పొందారు. వనపర్తి జిల్లాలోని జిల్లా గణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ గా విధులు నిర్వహిస్తున్న కే. రాధ ను డి ఐ ఈ ఓ గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శుక్రవారం బాధ్యతలు తీసుకున్న కె. రాధ ను 23వ వార్డు బిజెపి కౌన్సిలర్ అభ్యర్థి తిరుమలేష్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్ వై కె ఎస్ వాలంటీర్ అభిలాష్, చైతన్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

### రంగారెడ్డి జిల్లా ప్రజా పరిషత్
## ప్రత్యేక అధికారిగా కలెక్టర్ శశాంక.



రంగారెడ్డి జూలై 5 (చైతన్య గళం): జిల్లా ప్రజా పరిషత్ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ శశాంక శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ZPపాలక వర్గం పదవీ కాలం పూర్తి కావడంతో కలెక్టర్ను ప్రత్యేక అధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు కలెక్టర్ శుక్రవారం జిల్లా పరిషతక్కు చేరుకొని బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ZP CEO కృష్ణ రెడ్డి, ఇతర అధికారులు కలెక్టర్ శశాంకకు స్వాగతం పలికి పుష్ప గుచ్చాలు అందించి అభినందనలు తెలిపారు.

## కల్వకుర్తి ఆర్డీవోకు వికలాంగుల సంఘం వినతి



కల్వకుర్తి జులై 5 (చైతన్య గళం): నాగర్ కర్నూలు జిల్లా కల్వకుర్తి ఆర్డీవో కి శుక్రవారం వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నుంచి వినతిపత్రం సమర్పించడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా 6000 రూపాయల పెన్షన్ అమలు చేయాలని , పురుష వికలాంగులకు ఉచిత బస్సు సౌకర్యం ఇవ్వాలని, బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ చేయాలని, 2016 వికలాంగుల రక్షణ చట్టం పటిష్ట అమలుకు చర్యలు తీసుకోవాలని కోరడం జరిగింది. వికలాంగుల పెన్షన్కు ఆదయ పరిమితి విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 17 ఉపసంహరించాలని, ప్రతినెల 5వ తేదీన పెన్షన్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాము. ఈ వినతిపత్రం పై ఆర్డీవో స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి ఈ డిమాండ్లను పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కోట్ల గౌతమ్, ప్రధాన కార్యదర్శి పులిజాల బాలీశ్వర్, భోగరాజు శ్రీనివాసులు పాల్గొన్నారు.

### BJYM రాష్ట్ర శాఖ
## పిలుపు మేరకు కలెక్టరేట్ ముట్టడి
### -రంగారెడ్డి జిల్లా.




రంగారెడ్డి జిల్లా జులై 5 (చైతన్య గళం): bjym అధ్యక్షులు యాదిష్ నేతృత్వంలో రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం చెప్పటం జరిగింది.కల్వకుర్తి అసెంబ్లీ నుండి భారీ తరలిన BJYM నాయకులు. రంగారెడ్డి జిల్లాకు సంబంధం లేని ఉపాధ్యాయులను బదిలీ పేరుతో DEO అధికారం ఉపయోగించి డబ్బులు లంచాలుగా తీసుకోని రంగారెడ్డి జిల్లాకు బదిలీ చేసి ఇక్కడి వారికీ అన్యాయం చేయడం జరిగింది. కావున వారిపై చర్యలు తీసుకోని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ. గ్రూప్ వన్ ప్రిలిమ్స్ లో 1:100 ప్రకారం క్వాలిఫై చేయాలి.గ్రూప్ 2 గ్రూప్ 3 నోటిఫికేషన్లలో అదనంగా పోస్టులను పెంచాలి. 25 వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీని నిర్వహించాలి.ప్రస్తుత డీఎస్సీ పరీక్ష తేదీలను పోస్ట్ పోన్ చేసి నూతన తేదీలను ప్రకటించాలి. అన్ని నియామకాల్లో మహిళా అభ్యర్థుల కి 33% రిజర్వేషన్ ను కేటాయించాలి. జాబ్ క్యాలెండర్ ను వెంటనే విడుదల చేయాలి. కార్యక్రమంలో BJP రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బొక్క నర్సింహా రెడ్డి మరియు bjym రాష్ట్ర నాయకులు నీలకంఠ పాండు, భగీరథ,జిల్లా ప్రధాన కార్యదర్శి దిలీప్ గౌడ్,పోతుగంటి మహేష్.BJYM అసెంబ్లీ కన్వీనర్ పద్మ అనిల్, Bjym నాయకులు మధు,ధనుష్, కిరణ్, రాజేందర్, కార్తీక్, రాజ్ కుమార్, రాష్ట్ర, జిల్లా, తాలూకా, మండల నాయకులు పాల్గొన్నారు.

# బిజెపిని నిలువరించే బాధ్యత కమ్యూనిస్టులపైనే ఎక్కువ

### - సిపిఐ కార్యవర్గ సభ్యులు బాల నరసింహ




నపర్తి జులై 5 (చైతన్య గళం): దేశంలో బిజెపిని నిలువరించాల్సిన బాధ్యత కమ్యూనిస్టులపైనే ఎక్కువగా ఉందని సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల నరసింహ అన్నారు. వనపర్తి సిపిఐ జిల్లా కార్యాలయంలో సిపిఐ జిల్లా విస్తృత కౌన్సిల్ సమావేశం గోపాల్ అధ్యక్షతన జరిగింది. బాల నరసింహ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో, ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో కాంగ్రెస్ ఉదాసీనత వైఖరి వల్లే బిజెపి బలపడిందన్నారు. మహబూబ్నగర్ ఎంపీ స్థానంలో సీఎం 8 సార్లు పర్యటించినా, కిందిస్థాయి క్యాడర్ నిర్లక్ష్యం కారణంగా 4,500 స్వల్ప ఓట్ల తేడాతో ఆ సీటు కాంగ్రెస్ చేజారటం అందులో భాగమన్నారు. సికింద్రాబాద్లో అభ్యర్థి దానం నాగేందర్ గట్టిగా పని చేయలేదన్నారు. మల్కాజ్గిరి లో వేరే ప్రాంతం అభ్యర్థిని పెట్టటం కాంగ్రెస్కు మైనస్ గా మారిందన్నారు. ఇలా పలు చోట్ల వివిధ కారణాలు ఉన్నాయన్నారు. దేశంలో 400 స్థానాలు గెలుస్తామని ధీమాతో ఉన్న బిజెపి కేవలం 240 స్థానాలకే పరిమితమైందన్నారు. రామాలయం నిర్మించిన అయోధ్య ఎంపి స్థానంలో ఘోర పరాజయం చవి చూందన్నారు. అంతేగాక దేశంలోని ఆరు ప్రధాన దేవాలయాలు ఉన్న పార్లమెంటు సీట్లలో బిజెపి ఓడిందన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో వారణాసిలో 4 లక్షల అరవై వేల ఓట్ల మెజార్టీతో గెలిచిన నరేంద్ర మోడీ ఈ ఎన్నికల్లో కేవలం లక్ష 40,000 ఓట్ల మెజార్టీతో మాత్రమే గెలిచారన్నారు. ఆలయాల కంటే తమ అవసరాలు ముఖ్యమని సాధారణ ప్రజలు భావించి ఓట్లు వేయటమే కారణమన్నారు. కాంగ్రెస్ ఒంటెత్తు పోకడ వల్ల మధ్యప్రదేశ్, చత్తీస్గడ్, ఒడిస్సా తదితర రాష్ట్రాలలో చాలా సీట్లను ఇండియా కూటమి కోల్పోయిందన్నారు. సమిష్టిగా పనిచేసే ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. బిజెపి ఈ ఎన్నికల్లో చేతికి లబడినప్పటికీ, దాని మతతత్వ విస్తరణ సైదాంతిక పోరాటాన్ని ఆపలేదన్నారు. కమ్యూనిస్టు పార్టీల శక్తి తక్కువే అయినా, దాన్ని నిలువరించే సైదాంతిక బలం కమ్యూనిస్టులతో ఉందన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసుకోవలసిన అవసరం ఉందన్నారు. ఆగస్టు 22 ,23 ,24 సిపిఐ రాష్ట్ర పార్టీ నిర్మాణ సభలు జరుగుతాయని, గ్రామ, మండల, జిల్లా నిర్మాణ సభలను అనుగ జిల్లా నిర్మాణ సభలను ఆలోగా పూర్తి చేసుకోవాలన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి విజయరాములు అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ పనితీరుపై నివేదిక ఇచ్చారు. గ్రామ మండల జిల్లా నిర్మాణ సభలను త్వరగా పూర్తిచేయలన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి కళావతమ్మ, రాబర్ట్, మోష, జే చంద్రయ్య, రమేష్, అబ్రహం, శ్రీరామ్ ,గోపాలకృష్ణ, గోపాల్, ఏ రవీందర్, శ్రీహరి, సీఎన్ శెట్టి, శాంతన్న, బాలరాజు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల హక్కులు చట్టాల పై అవగాహన

### -పాల్గొన్న జిల్లా మహిళ స్త్రీ మరియు శిశు సంక్షేమ అధికారి లక్ష్మీ బాయ్



వనపర్తి జులై 5 (చైతన్య గళం): రూరల్ డెవలప్మెంట్ సొసైటీ కార్యాలయం నందు కైలాసత్యర్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ యొక్క వనపర్తి జిల్లా సిబ్బంది,గద్వాల జిల్లా సిబ్బంది, మహబూబ్ నగర్ జిల్లా సిబ్బందికి బాలల హక్కులు,మహిళల రక్షణలు చట్టాలు, బాల్య వివాహం, బాల కార్మిక చట్టాల గురించి ట్రైనింగ్ ప్రోగ్రామ్ ను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా మహిళ స్త్రీ మరియు శిశు సంక్షేమ అధికారి లక్ష్మీ బాయ్, బాలల సంక్షేమ కమిటీ సభ్యురాలు వనజ,బాలల సంరక్షణ అధికారి రాంబాబు, మానవ అక్రమ రవాణా యూనిట్ అధికారి అంజాద్ , సఖి సెంటర్ నిర్వాహకురాలు కవిత హాజరై మహిళల చట్టాల పై కైలాశ్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ మరియు రూరల్ డెవలప్మెంట్ సొసైటీ సిబ్బందికి శిక్షణ అందించారు.చిన్నమ్మ థామస్ మాట్లాడుతూ పిల్లల సంక్షేమం మరియు అభివృద్ధి కోసం కైలాస్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ మరియు రూరల్ డెవలప్మెంట్ సొసైటీ వివిధ కార్యక్రమాలను నిర్వహించమన్నారు. కవిత మాట్లాడుతూ సఖి సెంటర్ ద్వారా చాలామంది పేద మహిళలకు ఆశ్రయం కల్పించామని వారి జీవితాల్లో మార్పుకు కారణమయ్యామని తెలిపారు. అంజద్ మాట్లాడుతూ నూతన భారతీయ చట్టాలు మహిళల భద్రతకు పెద్దపీట వేసాయని పేర్కొన్నారు. వనజ మాట్లాడుతూ బాలల సంక్షేమం కోసం ప్రభుత్వాలు మాత్రమే కాకుండా ప్రజలు మరియు తల్లిదండ్రులు కూడా బాధ్యతాయుతంగా ఉండాలని కోరారు, రాంబాబు మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలతో స్నేహపూర్వక స్వభావన్ని కలిగి ఉండాలని మరియు వారి యొక్క భావాలను తెలుసుకొని పిల్లలతో ప్రవర్తించడం ద్వారా వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయడం సాధ్యపడుతుందని తెలిపాడు, లక్ష్మీబాయ్ మాట్లాడుతూ బాలల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కైలాస్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ కోఆర్డినేటర్స్ ఆల్విన్, విశ్వకాంత్, చంద్రశేఖర్, సిబ్బంది కన్నన్ కుమార్, హరికృష్ణ ,రాజశేఖర్, రజనీకాంత్, రూరల్ డెవలప్మెంట్ సొసైటీ సిబ్బంది శ్రీలక్ష్మి, అరుణ,జ్యోతి, రామకృష్ణ, మొగులయ్య, రేణుక తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్



మేడ్చల్ జులై 5 (చైతన్య గళం): మేడ్చల్ జిల్లా ప్రజా పరిషత్ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ గౌతమ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జడ్పీ పాలక వర్గం పదవి కాలం పూర్తి కావడంతో కలెక్టర్ ను ప్రత్యేక అధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.ఈ మేరకు కలెక్టర్ శుక్రవారం జిల్లా పరిషత్ కు చేరుకొని బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జడ్పీ సీఈవో దిలీప్, కలెక్టర్ గౌతమ్ కు స్వాగతం పలికి పుష్పగుచ్చం అందించి అభినందనలు తెలిపారు

## బదిలీపై వెళ్తున్న టీచర్లకు ఘన సన్మానం



ఆమనగల్లు జులై 5 (చైతన్య గళం): అమనగల్ పట్టణంలో ఉన్న జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయురాలు సుశీల, అరుణ శ్రీ, విద్యావతి, మాలతి, గార్లకు వీడ్కోలు సన్మానోత్సవ వేడుకలు శృతిలయ కల్చర్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు పూలమాల శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు.ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, శృతిలయ కల్చర్ అకాడమీ అధ్యక్షులు చిత్తరంజన్ దాస్, సంఘ సేవకులు పాపిశెట్టి రాము, మాజీ విద్యా కమిటీ చైర్మన్ తిరుపతి గౌడ్, శ్రీను నాయక్, మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## బీజేవైఎం నాయకుల ముందస్తు అరెస్ట్



యాచారం జులై 5 (చైతన్య గళం): యాచారం నిరుద్యోగులకు మద్దతుగా ఉద్యోగ క్యాలెండర్ విడుదల చేయాలని, గ్రూప్ 2, గ్రూప్ 3 లలో ఉద్యోగ అవకాశాలను పెంచాలని, మెగా డీఎస్సీ నిర్వహించాలని శుక్రవారం బీజేవైఎం తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి పిలుపునివ్వడంతో హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులు బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు ముంత జంగయ్య బీజేవైఎం నాయకులు శివ మోడీ.. ముందస్తు అరెస్టులు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... ఉద్యోగాల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇంతకు ముందున్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఎలాగైతే నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే వైఖరి అవలంబిస్తుందని, నిరుద్యోగుల సమస్యల కొరకు పోరాటం చేస్తున్న మమ్మల్ని ఎన్ని అక్రమ అరెస్టులు చేసినా తెలంగాణ నిరుద్యోగులకు అండగా బీజేవైఎం పోరాట ఉద్యమం చేస్తూనే ఉంటుందని అన్నారు.